## క్లుప్తంగా

### బాణసంచా అక్రమ నిల్వలపై చర్యలు తప్పవు



మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

పరవాడ: దీపావళి పండగ పురస్కరించుకుని అనుమతుల్లేకుండా బాణసంచా నిల్వ, తయారీ, అమ్మకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాకు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏటా కొంతమంది తమ ఇళ్లలో అక్రమంగా బాణ సంచా నిల్వ చేసి అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై తనిఖీలు నిర్వహిస్తామన్నారు. తమ తనిఖీల్లో బాణసంచా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది మండల నలుమూలల అనుమతుల్లేకుండా అక్రమంగా బాణసంచా అమ్మకాలు జరుపుతున్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీస్ నిఘా ఏర్పాటు చేశామన్నారు.

### పాఠశాలకు షామియానా వితరణ



షామియానాలను అందిస్తున్న మాజీ ఎంపీపీ అప్పలనాయుడు

పరవాడ: నాయుడుపాలెం గ్రామానికి చెందిన దివంగత కూండ్రపు అప్పలనాయుడు మాస్టర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగి కూండ్రపు నరసింహమూర్తి రూ.26 వేలతో రెండు షామియానాలను సమకూర్చారు. వీటిని పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు సోమవారం పాఠశాల యాజమాన్యానికి అందించారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, వాడచీపురుపల్లి సర్పంచ్ శివలంక లక్ష్మి, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, పాఠశాల కమిటీ చైర్మన్ లెక్కల సన్యాసిరావు, పాఠశాల హెచ్‌ఎం నొట్ల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు కూండ్రపు అప్పలనాయుడు, గెడ్డం నరసింగరావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దొంగ ఓట్ల నియంత్రణకు వినతి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న అప్పలరాజు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీకి భవిష్యత్‌లో జరగబోయేస్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ దొంగ ఓట్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన జనసేన నాయకుడు అరిజిల్లి అప్పలరాజు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజును కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినపతిపత్రం అందించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ముత్యాలమ్మపాలెం పంచాయతీలో ఫేక్ అడ్రస్‌లు సృష్టించి దొంగ ఓట్లు వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు.

### పొల్ట్రీని గ్రామానికి దూరంగా తరలించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వాలిమెరక గ్రామస్తులు

మహారాణిపేట: పౌల్ట్రీ వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, తక్షణం ఈ పరిశ్రమను గ్రామానికి దూరంగా తరలించాలని వాలిమెరక గ్రామ పంచాయతీ ప్రజలు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సియ్యదుల సాయివేని, 30 మంది ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పెందుర్తి మండలం వాలిమెరక పంచాయతీ దువ్వపాలెం పరిసరాలు, సౌభాగ్య రాయపురంలో సుమారు 15 ఏళ్ల నుంచి రమాదేవి పౌల్ట్రీస్ నడుపుతున్నారని, దాని వల్ల గ్రామస్తులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, తక్షణమే ఈ పౌల్ట్రీస్ ప్రజలకు దూరంగా తరలించాలని కోరారు.

### 17, 18 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

అగనంపూడి: ఎస్జీఎఫ్ పరవాడ మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.లక్ష్మి తెలిపారు. పోటీలు ఎక్కడ నిర్వహించాలనే అంశంపై చర్చించేందుకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు మండలంలోని ఉన్నత పాఠశాలల పీడీలతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. గడువులోగా పోటీలు పూర్తి చేసుకుని 21 నుంచి 23 వరకు నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.






నాయుడుతోట సమీపంలోని పెందుర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శరగడం, గండి రవి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

# కల్తీ మద్యం కూటమి కుటీర పరిశ్రమ



మీడియాతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్

- రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం సరఫరా చేస్తున్న కూటమి నాయకులు
- నిరుద్యోగుల్ని గాలికి వదిలి నకిలీ మద్యంతో కూటమి నాయకులకు ఉపాధి
- పరవాడలో సైతం కల్తీ మద్యం డంప్‌లు బయటపడ్డాయి
- చంద్రబాబు ప్రభుత్వం పేదల ప్రాణాలను హరిస్తోంది
- ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ ఎక్కడున్నారో?
- కల్తీ మద్యంపై నిరసనలో ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: 'రాష్ట్రంలో కూటమి నాయకులకు కల్తీ మద్యం తయారీ ఓ కుటీర పరిశ్రమగా మారింది. నిరుద్యోగులను గాలికి వదిలేసి టీడీపీ నాయకులకు ఉపాధి కల్పించడం కోసం సీఎం చంద్రబాబు కనుసన్నల్లో ఎక్కడికక్కడ కల్తీ మద్యం డెన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు నాణ్యమైన మద్యం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి.. అధికారంలోకి వచ్చాక కల్తీ మద్యం తయారు చేసి పేదల ప్రాణాలను హరిస్తున్న దుర్మార్గమైన ప్రభుత్వమిది'అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ కనుసన్నల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తయారవుతున్న కల్తీ మద్యంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో నాయుడుతోట సమీపంలోని పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్ ఎదుట సోమవారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

**టీడీపీ నాయకుల ఉపాధి.. కల్తీ మద్యం తయారీ**

ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం తయారీని టీడీపీ నాయకులు అనధికారిక కుటీర పరిశ్రమగా మార్చుకున్నారని ఆక్షేపించారు. సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితులే ఈ కల్తీ మద్యం కుంభకోణంలో ఉండడంతో కేవలం నామమాత్రపు చర్యలతో సరిపుచ్చుతున్నారని ఆరోపించారు. కల్తీ మద్యం తయారీని నిరోధించకుండా.. వీరి మద్యం డెన్‌లు బయటపడకుండా జాగ్రత్తలు పాటించడం ఆందోళన కలిగించే అంశమన్నారు. అక్రమ మార్గాల్లో ధనర్జనే ధ్యేయంగా పేద ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని మండిపడ్డారు.

**డీసీఎం స్పందించరేం?**

ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యం అందిస్తామని సిగ్గులేకుండా చెప్పిన చంద్రబాబుకు మద్దతు పలికిన పవన్‌కల్యాణ్ ఈ కల్తీ మద్యం కుంభకోణంపై కనీసం స్పందించకపోవడంలో ఆంతర్యం ఏంటో ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పుకునే పవన్‌కల్యాణ్.. చంద్రబాబుకు కష్టం వస్తే డైవర్షన్ రాజకీయాలు చేయడం తప్ప పేద ప్రజల జీవితాలు పట్టవా? అని ప్రశ్నించారు. పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని పరవాడలో కూడా కూటమి నాయకుల కనుసన్నల్లో నకిలీ మద్యం తయారు కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకుల పాత్రపై కూడా ప్రజలకు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కల్తీ మద్యం తయారీని నియంత్రించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ఎస్‌ఈసీ సభ్యుడు శరగడం చినఅప్పలనాయుడు, సీనియర్ నేత గండి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవి సాంబ, జీవీఎంసీ 93, 94, 95, 96, 97, 98, 79 వార్డుల అధ్యక్షులు దాసరి సత్తిబాబు, తామర్ల నర్సింగ్, రాపర్తి మాధవరావు, మెంటి మహేష్, కొలుసు ఈశ్వరరావు, అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కొటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బంధం నాగేశ్వరరావు, చొప్పా నాగరాజు, గొరపల్లి శ్రీను, వద్దాది అప్పలరాజు, సబ్బవరపు నారాయణమూర్తి, కొయిలాడ శ్రీను, యతిరాజుల నాగేశ్వరరావు, పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, కోరాడ చందుయాదవ్, గొరపల్లి సాంబ, ఎస్‌జేడీ శ్రీను, నారిపిన్ని అప్పలరాజు, వినోద్, జగదీష్, వేపాడ శ్రీను, మహేష్, యడ్ల నాయుడు, ఐడి బాబు, మల్లువలస సన్నిబాబు, రాంబాబు, చరణ్‌రాజ్, గోవింద్ పట్నాయక్, జతిన్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ముసురుకున్న వివాదం




కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ, దళిత, ప్రజా సంఘాల నాయకులు



అంబేడ్కర్‌నగర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం



ఆర్డీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకురాలు లక్ష్మి, ప్రజా సంఘాల నేతలు

- 15 ఏళ్ల క్రితం నుంచి విగ్రహం ఉందని పెందుర్తి తహసీల్దార్ రిపోర్టు
- ఆ స్థలం తనదంటూ హైకోర్టులో కేసు వేసిన ప్రైవేట్ వ్యక్తి
- అతనికి అనుకూలంగా తీర్పు వచ్చిందని విగ్రహం తొలగింపునకు ఆర్డీవో ఆదేశాలు
- ఆర్డీవో, పెందుర్తి రెవెన్యూ అధికారులపై చర్యలకు కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదులు

పెందుర్తి:

స్థానిక మండల రెవెన్యూ పరిధి జీవీఎంసీ 97వ వార్డు అంబేడ్కర్‌నగర్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ వివాదం ముసురుకుంది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులో ప్రైవేట్ వ్యక్తికి అనుకూలంగా తీర్పు వచ్చినట్లు పేర్కొంటూ అంబేడ్కర్ విగ్రహ తొలగింపునకు ఆర్డీవో శ్రీలేఖ ఆదేశాలివ్వడంపై ప్రజా సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ఆర్డీవోతో పాటు పెందుర్తి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజాసంఘాల నేతలు జిల్లా కలెక్టర్‌కు, పెందుర్తి పోలీసులకు సోమవారం ఫిర్యాదులు చేశారు.

**ఇదీ వివాదం..**

అంబేడ్కర్‌నగర్, ఏకలవ్యకాలనీ సమీపంలోని సర్వే నెం.164లో 17.99 ఎకరాల గయాలు భూమి ఉంది. దీన్ని 2003లో ప్రభుత్వం వీఎంఆర్‌డీఏ(వుడా)కి అప్పగించింది. అదే ఏడాది ఈ భూమిని లేఅవుట్ వేసిన వీఎంఆర్‌డీఏ ప్లాట్లుగా విభజించి, వేలం వేసింది. అందులో చందక శ్రీకృష్ణ అనే వ్యక్తి 266.67 గజాల ప్లాట్ కొనుగోలు చేశారు. అప్పటికే ఆ స్థలంలో అంబేడ్కర్ విగ్రహంతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన బోర్‌వెల్ ఉంది. దాదాపు 18 ఏళ్ల తర్వాత 2021లో ప్లాట్‌కు వచ్చిన శ్రీకృష్ణ అందులోని అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన అంబేడ్కర్‌నగర్ మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఇందిరతో పాటు స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు.

దీంతో వివాదం ముదిరి 2021లో హైకోర్టులో శ్రీకృష్ణ కేసు వేశారు. కేసు విచారించిన హైకోర్టు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, తమకు నివేదిక ఇవ్వాలని అప్పటి కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు 2021లో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన అప్పటి తహసీల్దార్ పి.రామారావు 15 ఏళ్ల క్రితం నుంచి అంబేడ్కర్ విగ్రహంతో పాటు, బోర్‌వెల్ కూడా ఉందని నివేదిక ఇచ్చారు. అంతేకాకుండా ఆ స్థలం హక్కుల కోసం విచారణ సమయంలో ఎవరూ రాలేదంటూ తహసీల్దార్ నివేదికలో పొందుపరిచారు. ఇప్పటికీ ఆ కేసు తీర్పు హైకోర్టులో రిజర్వ్‌లో ఉంది.

**రెవెన్యూ అధికారుల అత్యుత్సాహం**

అయితే హైకోర్టులో తీర్పు పెండింగ్‌లో ఉన్నప్పటికీ.. తాజాగా రెవెన్యూ అధికారులు అత్యుత్సాహంతో రెండు రోజుల క్రితం రాత్రి పొద్దుపోయాక మాస్కులు ధరించిన విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో పెద్ద ఎత్తున ప్రజా సంఘాల నాయకులు, కాలనీల వాసులు పెందుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నా విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేయడం పట్ల మండిపడ్డారు. హైకోర్టులో తీర్పు తనకు అనుకూలంగా వచ్చినట్లు శ్రీకృష్ణ రెవెన్యూ అధికారులకు చెబితే కనీసం క్షేత్ర పరిశీలన కూడా చేయకుండా అతడికి అనుకూలంగా వ్యవహరించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆర్డీవో శ్రీలేఖ, పెందుర్తి తహసీల్దార్ ఐ.వెంకటఅప్పారావు, వీఆర్వో సాయిచంద్‌తో పాటు ఇతర రెవెన్యూ సిబ్బందిపై కలెక్టర్ హరేందిరప్రసాద్‌తో పాటు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

> **హైకోర్టులో కేసు ఉండగా ఆదేశాలెలా ఇస్తారు?**
>
> అంబేడ్కర్‌నగర్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహంపై వివాదం హైకోర్టులో ఉంది. ఇక్కడ 15 ఏళ్ల క్రితం నుంచే విగ్రహంతో పాటు బోర్‌వెల్ ఉందని 2021లోనే కలెక్టర్‌కు అప్పటి పెందుర్తి తహసీల్దార్ నివేదిక ఇచ్చారు. కానీ విగ్రహాన్ని తొలగించాలని ఆర్డీవో శ్రీలేఖ పెందుర్తి రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలివ్వడం విడ్డూరంగా ఉంది. అసత్యాలు చెప్పిన శ్రీకృష్ణ అనే వ్యక్తితో పాటు ఆర్డీవో, పెందుర్తి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.
>
> – ఎం.లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ప్రగతిశీల మహిళా సంఘం

# వెంకన్న సన్నిధిలో ఘనంగా నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

- హుండీ ఆదాయం రూ.5.53 లక్షలు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చన చేశారు. భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

**హుండీ లెక్కింపు:**

వేంకటాద్రి క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 70 రోజులకు గాను రూ.5,52,768 ఆదాయం వచ్చినట్లు ఈవో ఎం.నీలిమ తెలిపారు. ఆలయ పర్యవేక్షణాధికారి శ్రీనివాస్, అర్చకుడు మహర్షి శ్రీనివాసచార్యులు లెక్కింపును పర్యవేక్షించారు.

## పీజీఆర్‌ఎస్‌కు వినతులు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు, అధికారులు

పరవాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో వివిధ సమస్యలపై 13 ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ బి.నాగరాజు తెలిపారు. పెదముషిడివాడలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో సీసీ రహదారిని నిర్మాణం పూర్తి చేసినప్పటికీ, అధికారులు బిల్లుల చెల్లింపులో ఆలస్యం చేస్తున్నారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. తాడి గ్రామానికి చెందిన ఓ వికలాంగుడు తనకు వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరాడు. మండలం మొత్తమ్మీద భూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ నాగరాజు చెప్పారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీడీవో రమేష్‌నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌పై దాడి కేసులో జరిమానా

పరవాడ: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి కేసులో పరవాడ మండలం రావాడకు చెందిన షేక్ చిన్నారావుకు రూ.3 వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి 11వ అదనపు కోర్టు న్యాయమూర్తి ఎ.రమేష్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ కేసులో ముద్దాయి జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో వెల్లడించారని పేర్కొన్నారు. పరవాడ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ పి.అచ్చింనాయుడుపై 2019లో రావాడ గ్రామానికి చెందిన షేక్ చిన్నారావు దాడి చేసి, విధి నిర్వహణకు అడ్డుతగిలాడు. ఈయనపై అప్పటి సీఐ రఘువీర్ విష్ణు ఆదేశాలతో ఎస్‌ఐ ఐ.గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. దర్యాప్తు నివేదికను కోర్టుకు సమర్పించాక, ముద్దాయి నేరం చేసినట్లు రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు సీఐ మల్లికార్జునరావు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జీహెచ్‌ఎస్ విద్యార్థులు



రాష్ట్ర, జిల్లాస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం చిన్నమ్మాయి, సిబ్బంది

పెందుర్తి: ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా హాకీలో పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నక్కపల్లి కేంద్రంగా ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–17 హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి తెలిపారు. కైలాసపురంలో జరిగిన అండర్–14 జిల్లా స్థాయి పోటీల్లో మరో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. వీరందరినీ సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎంతోపాటు పీఈటీ వరహాలమ్మ, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

## కేజీహెచ్‌లో ఫుట్ స్కానింగ్ ప్రారంభం



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

మహారాణిపేట: ఫుట్ స్కానింగ్ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి అన్నారు. సోమవారం కేజీహెచ్ ఆర్థోపెడిక్ ఓపీలో ఏపీ మెడిటెక్ జోన్ సహకారంతో వైద్యులకు, పోస్ట్–గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణి మాట్లాడుతూ, పాదంలో బరువు ఎలా సమతుల్యంగా ఉందో దీని ద్వారా తెలుస్తుందన్నారు. ఈ సౌకర్యం ఇంతవరకు హైదరాబాద్‌లో మాత్రమే ఉందని, కానీ నేటి నుంచి విశాఖలో కూడా ఈ సౌకర్యం లభిస్తుందన్నారు. ఏపీ మెడిటెక్ జోన్ ద్వారా ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్ ద్వారా ఈ అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎం. చంద్రశేఖరం నాయుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. మన్మధరావు, పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీ.ఎన్. చక్రవర్తి, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం, ఇతర విభాగాల వైద్యులు, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

## సబ్‌నిర్మితి స్థలాన్ని జోనల్ కార్యాలయానికి అప్పగించాలి

అగనంపూడి: చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్న సబ్‌నిర్మితి కేంద్రం స్థలాన్ని అగనంపూడి జోనల్ కార్యాలయ శాశ్వత భవనం కోసం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తిని ఉక్కు కార్మిక సంఘం నేత బలిరెడ్డి సత్యనారాయణ వినతిపత్రంలో కోరారు. అగనంపూడి జోన్–9ను తాత్కాలికంగా అగనంపూడి కల్యాణ మండపంలో ఏర్పాటుకునిర్ణయించారన్నారు. శాశ్వత కార్యాలయం ఏర్పాటుకు అనువైన స్థలం హైవేను ఆనుకుని ఉందని, ఈ విషయంలో జిల్లా అధికారులతో చర్చించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రణాళిక



వాల్తేరు డివిజన్ అదనపు మేనేజర్ (ఆర్థిక) సతీష్‌తో చర్చిస్తున్న ప్రజా సంఘాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి, సౌకర్యాల కల్పన తదితర అంశాలపై తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ అదనపు మేనేజర్ (ఫైనాన్స్) జి.సతీష్ ప్రజా సంఘాలు, ప్రయాణికులు అభిప్రాయాలు సేకరించారు. అమృత సంవాద్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. సోమవారం దువ్వాడ రైల్వేస్టేషన్‌ను సందర్శించి ప్రయాణికులు, ప్రజా సంఘాల సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్ ఫీజులు తగ్గించాలని, బ్యాటరీ కార్ట్ చార్జీలు తగ్గించాలని, అలాగే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గర్భిణులకు రాయితీ ఇవ్వాలని కోరారు. ప్లాట్‌ఫారాలపై క్లాక్ రూమ్‌లు కాఫీ, టీ వెండింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నేతలు కె.ఈశ్వర్, సరోజిని, విజయ్‌కుమార్, మానవేంద్రనాథ్ వినతిపత్రాలు అందించారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ చిన్నం నాయుడు, అధికారులు రవి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

## పీజీఆర్‌ఎస్‌కు 7 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ శంకరరావు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 7 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్(ఇన్‌చార్జి) శంకరరావు వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ చేసి, తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.